తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
గురువారం
30 ఏప్రిల్ 2026
పేజీలు : 08






# అక్రమ వెంచర్‌పై అధికారుల అంతుచిక్కని ప్రేమ



## డిఎల్ పిఓ ఆదేశాలు బేఖాతరు

- అనుమతులు లేకున్నా.. నిబంధనలు తుంగలో తొక్కినా చర్యలేవి?
- అక్రమ వెంచర్ పై చర్యలకు జంకుతున్నా కిందిస్థాయి సిబ్బంది

**కొందుర్గు (జనంసాక్షి) :**
రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో వెలసిన 'త్రిశక్తి వెంచర్' అక్రమాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. నిబంధనలను బేఖాతరు చేస్తూ, అధికారుల కళ్లు గప్పుతూ సాగిస్తున్న ఈ దందా వెనుక ఉన్నది ఎవరు? ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం లెక్కచేయని ధీమా ఎక్కడిది? అనే ప్రశ్నలు ఇప్పుడు బహిరంగంగా వినిపిస్తున్నాయి.
త్రిశక్తి వెంచర్ యాజమాన్యం తీరు ప్రభుత్వ యంత్రాంగానికే సవాల్ విసురు తోంది. ఈ వెంచర్‌లో జరుగుతున్న అక్రమాలపై జనంసాక్షి దినపత్రికలో వరుస కథనాలను ప్రచురించింది.స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి దర్యాప్తునాకు ఆదేశించడంతో డి,ఎల్,పి,ఓ మల్లారెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, యాజమాన్యం మాత్రం అవేవీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ పనులను యథేచ్ఛగా కొనసాగించ డం వెనుక కిందిస్థాయి సిబ్బంది భారీ రాజకీయ అండదండలు ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
సాధారణంగా ప్రభుత్వం వెంచర్లకు అనుమతి ఇచ్చే సమయంలో కొన్ని ప్లాట్లను మార్టిగేజ్ (అమ్మకానికి వీలు లేకుండా రిజర్వ్) చేస్తుంది. కానీ, త్రిశక్తి వెంచర్ నిర్వాహకులు ఏకంగా 95 నుండి 125 మార్టిగేజ్ ప్లాట్లలో సుమారు 10 ప్లాట్లను అక్రమంగా విక్రయించింది. సామాన్య ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, ప్రభుత్వం దగ్గర ఉండాల్సిన ప్లాట్లను సైతం రిజిస్ట్రేషన్ల పేరుతో అంటగడుతున్నారు. అక్రమాలు కళ్లముందే జరుగుతున్నాయి. వరుస పత్రికలలో కథనాలతో బట్టబయలు చేస్తున్నా.. స్థానిక అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. అధికారుల అండతోనే మార్టిగేజ్ ప్లాట్ల విక్రయాలు సాగుతున్నాయా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల ఈ మౌనం వెనుక ఉన్న రహస్యమేంటో జిల్లా కలెక్టర్ విచారణ జరపాలని జనం డిమాండ్ చేస్తున్నారు.

**జిల్లా అధికారులు దృష్టి సారించాలి!**
రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఈ 'త్రిశక్తి వెంచర్' అక్రమాలపై జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. తక్షణమే విచారణ జరిపి, అక్రమ విక్రయాలను అడ్డుకోవడంతో పాటు, నిబంధనలు అతిక్రమించిన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా, సామాన్య ప్రజలు మోసపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు



## బంట్వారం పోలీస్ స్టేషన్ వీధుల్లో ఉన్న పోలీసులపై దాడి ఇద్దరికీ రిమాండ్

**బంట్వారం ఏప్రిల్ 29 (జనం సాక్షి) :**
బంట్వారం మండల కేంద్రంలో ఉన్న పోలీస్ స్టేషన్లో వీధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ పై దుర్భాషలాడి తమ వీధులకు ఆటంకం కలిగించిన ఇరువురిని పోలీసులు రిమాండ్ కు తరలించారు. ఎస్ ఐ విమల తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం నాడు అర్ధరాత్రి సమయంలో మద్యం సేవించి మత్తులో ఉన్న శ్రీకాంత్ లక్ష్మణ్ ఇరువురు పోలీస్ స్టేషన్లో వీధుల్లో ఉన్న కానిస్టేబుల్ కృష్ణతో వాగ్వాదానికి దిగారు ఈ సంఘటనపై కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసి ఇరువురిని రిమాండ్ కు పంపించినట్లు ఎస్ ఐ విమల తెలిపారు.

## బొంరాస్‌పేట ప్రభుత్వ పాఠశాలల సత్తా

- మండల వ్యాప్తంగా 95% ఉత్తీర్ణత:ఎంఈవో
- చౌదర్పల్లి పాఠశాలలో 100% ఉత్తీర్ణత
- మండల టాపర్‌గా ఐశ్వర్య 561 మార్కులు

**బొంరాస్ పేట, ఏప్రిల్ 29 (జనం సాక్షి):**
మండల వ్యాప్తంగా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు.మండల వ్యాప్తంగా 95% ఉత్తీర్ణత రావడం జరిగిందని మండల విద్యాధికారి హరిలాల్ తెలిపారు. మండల పరిధిలోని చౌదర్పల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలోని తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించారు.మండల టాపర్ గా ఏంజెపీటీడబ్ల్యూఆర్ఎస్ బురాన్ పూర్ పాఠశాలకు చెందిన ఐశ్వర్య (561) మార్కులు సాధించడం జరిగింది. బొంరాస్ పేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు మీడియంలో 53 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 47 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. మొత్తం మండల వ్యాప్తంగా 356 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 337 మంది తీర్ణత సాధించడం జరిగింది. బాలికలు 96% బాలురు 93% ఉత్తీర్ణత సాధించగా మండల వ్యాప్తంగా 95% ఉత్తీర్ణత రావడం జరిగింది.

**-మండల విద్యాధికారి హరిలాల్**

## పదిలో 99 శాతం ఉత్తీర్ణత



**కోట్ పల్లి ఏప్రిల్ 29(జనంసాక్షి):** పదవ తరగతి విద్యా సంవత్సరముకు 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి చంద్రప్ప తెలియజేశారు. మండలంలో మొదటి స్థానంలో కేజీబీ పాఠశాల విద్యార్థిని సహస్ర 558 మార్కులు , రెండవ స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మంగలి కావ్య 538 మార్కులు మూడవ స్థానంలో కేజీబీవీ పాఠశాల విద్యార్థిని పీజీ శ్రావణి 529 మార్కులు సాధించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి చంద్రప్ప మాట్లాడుతూ... తమ ఫలితాలను విజయవంతంగా సాధించి నందుకు ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయురాళ్లను మండల విద్యాశాఖ అధికారి చంద్రప్ప విశేషంగా అభినందించారు. అలాగే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి సబ్జెక్ట్ వారీగా ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, వారి బోధనా విధానం మరియు క్రమశిక్షణ వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు.లపదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు సంబంధిత ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు మరియు పాఠశాల సిబ్బందిని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో ఫలితాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

## తాండూరులో బీఆర్ఎస్‌కు మళ్లీ పూర్వవైభవం

- మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డిని కలిసిన నాయకులు
- కేసులు పెట్టినా కార్యకర్తలు వెనక్కి తగ్గరని వ్యాఖ్య
- వచ్చే ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం : నరేందర్ గౌడ్



**తాండూరు, ఏప్రిల్ 29 (జనంసాక్షి):**
రాబోయే శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం తిరిగి వస్తుందని పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నరుకుల నరేందర్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. అక్రమ కేసులో అరెస్ట్ అయి తాజాగా విడుదలైన మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డిని ఆయన బుధవారం తన నివాసంలో నాయకులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరేందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని కేసులు నమోదు చేసినా పార్టీ కార్యకర్తలు, అభిమానులు మాత్రం పైలట్ రోహిత్ రెడ్డి వెంటే ఉంటారని స్పష్టం చేశారు. తాండూరు నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజల మద్దతు కొనసాగుతోందని, వచ్చే ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటుకున్నారు.

## రామంతాపూర్‌లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహణ

### ముఖ్య అతిథులుగా పాల్గొన్న మందముల పరమేశ్వర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ ఏప్రిల్ 29 ( జనం సాక్షి ): రామంతాపూర్ ప్రాంతంలోని శ్రీ శ్రీ శ్రీ మహాంకాళమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి , ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవాలయ కమిటీ ప్రతినిధులు, వేద పండితుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, పూజలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఈ సందర్భంగా మందముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలందరికీ అమ్మవారి కటాక్షం ఉండాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సాంప్రదాయ విలువలను పెంపొందించడంలో దేవాలయాల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు.ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావాన్ని పెంచడంతో పాటు సమాజంలో సానుకూల వాతావరణాన్ని తీసుకువస్తాయని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.మహోత్సవంలో వేద పండితులు నిర్వహించిన ప్రత్యేక హోమాలు, మంత్రోచ్చారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు, హారతులతో అమ్మవారిని ప్రార్థించారు. యువత, స్థానిక నాయకులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు భీష్మ గౌడ్, సంజీవ్ రెడ్డి, నాగేందర్, తాఫిక్, రఫీక్, వాళ్ళపు శ్రీకాంత్ యాదవ్, గణేష్ నాయక్, అరుణ్ పటేల్, సందీప్, భాస్కర్, షాగా శ్రీధర్, ముత్యాల బాబు, ఎస్. జంగయ్య, కృష్ణ, ఎం. జంగయ్య, సత్తి అన్న, సచిన్, నయీం, యోగి విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు మహిళా రక్షణ కొత్త చట్టాలపై అవగాహన



**ఉప్పల్, ఏప్రిల్ 29 (జనం సాక్షి):** మల్కాజిగిరి పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు, మల్కాజిగిరి మహిళా భద్రత ఉప పోలీసు కమిషనర్ శ్రీమతి టి. ఉషారాణి సూచనలతో మల్కాజిగిరి అక్రమ రవాణా నిరోధక విభాగం మరియు ఉప్పల్ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో ఉప్పల్ పోలీసు స్టేషన్ పరిధిలోని జీహెచ్ఎంసీ, మండల రెవెన్యూ కార్యాలయం, రవాణా శాఖ కార్యాలయాలలో ప్రజాపాలనపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అక్రమ రవాణా నిరోధక విభాగం ఉప నిరీక్షకుడు ఎండి ఖలీల్ అహ్మద్, మహిళా ఉప నిరీక్షకురాలు సమత, సహాయ ఉప నిరీక్షకుడు వెంకట్ రెడ్డి, మహిళా సహాయ ఉప నిరీక్షకురాలు మీనా కుమారి, ప్రధాన కానిస్టేబుల్ మురళి, కానిస్టేబుల్ బానుప్రసాద్, మహిళా కానిస్టేబుల్ రజిత పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప నిరీక్షకుడు ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ కార్యాలయాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం--2013పై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. మహిళలపై అసభ్య ప్రవర్తన, అశ్లీల సందేశాలు పంపించడం, లింగ వివక్ష, మహిళలను మోసపూరితంగా లేదా బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టడం వంటి నేరాలపై వివరించారు.అలాగే చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు, బాలలను అమ్మడం, బలవంతపు భిక్షాటనకు వినియోగించడం, బాలికలను వేధించడం, అవయవాల మార్పిడికి వినియోగించడం వంటి అక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల భద్రత కోసం ప్రయాణాల సమయంలో భద్రతా అనువర్తనం వినియోగం, రోడ్డు భద్రతా నియమాలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, కొత్తగా అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక భద్రతా సంహిత, భారతీయ సాక్ష్యాధార చట్టాలపై కూడా అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు లేదా బెదిరింపులకు గురైనప్పుడు వెంటనే 1930 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళల సహాయానికి 1091, 181, చిన్నారుల రక్షణ కోసం 1098, అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 112 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో పలువురు పోలీసు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ముషీరాబాద్‌లో ఘనంగా జన సమితి ఆవిర్భావ వేడుకలు

### జనం పక్షాన జన సమితి ఎమ్మెల్సీ కోదండరాం



**ముషీరాబాద్, ఏప్రిల్ 29 (జనం సాక్షి):** తెలంగాణ జన సమితి ఎనిమిదేళ్లుగా జనం పక్షాన నిలబడి నిలదొక్కుకున్నదని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ కోదండరాం పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గం లోని రాంనగర్ మీసేవ ప్రాంతం లో నగర కమిటీ ఉపాధ్యక్షుడు పునిరెడ్డి జైపాల్ రెడ్డి, అడిక్మెట్ డివిజన్ అధ్యక్షుడు కాకునూరి సుధాకర్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం పార్టీ జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం మాట్లాడుతూ డబ్బు కేంద్రంగా ఉన్న ప్రస్తుత రాజకీయాలలో ప్రజల పక్షాన, ప్రజా సమస్యలపై అనునిత్యం గొంతు ఎత్తుతూ నిలబడిన పార్టీ జన సమితి పార్టీ అని అన్నారు. 8 ఏళ్ల కాలంలో ఆదివాసీల పక్షాన రైతుల పక్షాన నిరుద్యోగులకు అండగా కార్మికులకు చేదోడు వాదొడుగా పనిచేస్తూ, ప్రజా సమస్యలే వేదికగా ఉద్యమిస్తున్న పార్టీ తెలంగాణ జన సమితి అని అభిప్రాయపడ్డారు. ఈ ఆవిర్భావ వేడుకలకు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం నరసయ్య, ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సలీం పాషా, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు జస్వంత్ కుమార్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు జి రవీందర్ యాదవ్, ముషీరాబాద్ నియోజకవర్గం జన సమితి నాయకులు మహేష్, శంకర్ సత్యనారాయణ,రమాకాంత్, మహేందర్, నగర పార్టీ నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, రవికాంత్,సురేష్, సదానంద్, శివ , కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సెలవులకు ఊర్లకు వెళుతున్నారా అయితే జర భద్రం



**అంబర్పేట్ ఏప్రిల్ 29 (జనం సాక్షి)** వేసవికాలం సెలవులు వచ్చాయని స్వగ్రామాలకు విహారయాత్రలకు ,పెళ్లిళ్లకు ,వెళ్లే సమయంలో ఇంటి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంబర్పేట్ ఎస్ హెచ్ ఓ కిరణ్ కుమార్ సూచించారు. తాళాలు వేసిన ఇండ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు. ఇంటి భద్రత కోసం పలు సూచనలు చేశారు. ఇంటికి తాళం వేసి వెళ్లేటప్పుడు ఇంట్లో నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులను ఇంట్లో ఉంచరాదని, వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని మొబైల్ కు కనెక్ట్ చేసుకోవాలన్నరు. నమ్మకమైన వ్యక్తులకు మాత్రమే మీ ఇంటి సమాచారం ఇచ్చి ఇంటిపైన నిఘా ఉంచాలన్నారు. పిల్లల్ని చెరువులు కుంటలు నదులు మొదలగు నీటి నిల్వ గల ప్రదేశాలలో ఒంటరిగా వెళ్లనివ్వవద్దని,పెద్దల పర్యవేక్షణ నిరంతరం ఉండేటట్లు చూసుకోవాలన్నా రు. అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100 కి డయల్ చేయాలని ,లేదా సమీప పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని తెలియజేశారు .వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకి వెళ్లడం చేయరాదు అన్నారు. శరీరానికి చలవ చేసే పదార్థాలను తీసుకోవాలని చెప్పారు.ప్రజలు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను, మరియు చోరీలను నివారణ చేయగలుగుతామన్నారు.

# ఉచిత వైద్య శిబిరం




**అంబర్పేట్ ఏప్రిల్ 29 (జనం సాక్షి)** అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఎండాకాలంలో ఆరోగ్యం పట్ల ఎంతో జాగ్రత్తగా ఉండాలి అని వేసవిలో శరీరం వేడిమిని సమతుల్యం చేసేందుకు శరీరం నుండి చెమట ను బయటకి పంపుతుంది అందువల్ల మనకు నీటి అవసరం శరీరానికి ఎంతో ఉంటుంది.అధికంగా నీరు తీసుకోవడం మంచిదని సికింద్రాబాద్ జూన్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ ర క్షితమూర్తి అన్నారు. అంబర్పేట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సహకారంతో జనహిత సేవా ట్రస్ట్,ఎస్ ఆర్ డి స్వచ్ఛంద సంస్థ,కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసర్చ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గోల్నాక లంక తులసి రామ్ నగర్ బస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఫ్రీ మెడికల్ క్యాంపును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరి కై నా అనారోగ్య సమస్యలు వస్తే వైద్యుల సూచన మేరకు మొత్తం డోసును మందులు వాడాలన్నారు.అనవసరంగా పెయిన్ కిల్లర్స్ వాడొద్దని, సూచించారు. పోలీసు శాఖ శాంతి భద్రతల పరిరక్షణతో పాటు సామాజిక సేవ కార్యక్రమాలు కూడా చేపడుతుందని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 240 మంది రోగులకు కిమ్స్ ఆస్పత్రి నుండి వచ్చిన జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిషన్, గైనకాలజిస్ట్, పీడియాట్రిక్ సేవలను అందించారు. రోగులందరికీ బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వారికి ఉచితంగా మందులను అందజేశారు ఈ శిబిరంలో సికింద్రాబాద్ జోన్ అదనపు డి సి పి జె నరసయ్య, ఏ సి పి జగన్, అంబర్పేట్ పిఎస్ ఇన్స్పెక్టర్ టి కిరణ్ కుమార్, డి. ఐ హాఫిజుద్దీన్, ఎస్. ఐ సంధ్య, జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నరసింహమూర్తి, ఎస్ ఆర్ డి ప్రతినిధులు శివరాణి, ఇందిరా భారతి ,వెంకటేశ్వరి తులసి రామ్ నగర బస్తీ అధ్యక్షులు దేవేందర్, అంజయ్య, బద్రి, రాజేష్ శ్రీరామ్, క్యాంప్ కోఆర్డినేటర్ నర్సింగరావు, విక్రమ్ ,తదితరులు పాల్గొన్నారు.

## బీరప్పగడ్డ డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



**ఉప్పల్, ఏప్రిల్ 29 (జనం సాక్షి):** బీరప్పగడ్డ డివిజన్‌కు సంబంధించిన పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఎం. పరమేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డివిజన్‌లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను శ్రద్ధగా విన్న పరమేశ్వర్ రెడ్డి వాటిని దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇర్షాద్ ఖాన్ స్పందించిన పరమేశ్వర్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో బీరప్పగడ్డ డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎక్కామిడి హనుమాన్ ఆలయానికి ఘన ఆరంభం

- వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు
- స్పీకర్ ప్రసాద్ కుమార్, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి హాజరు
- మూడు రోజులపాటు పూజలు, హోమాలు, భజనలు
- అన్నదానం, భక్తులతో కిక్కిరిసిన గ్రామం





**నవాబుపేట్, ఏప్రిల్ 29 (జనంసాక్షి):** నవాబుపేట్ మండల పరిధిలోని ఎక్కామిడి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. వైశాఖ శుద్ధ ఏకాదశి నుంచి త్రయోదశి వరకు మూడు రోజులపాటు నిర్వహించిన ఈ మహోత్సవాల్లో భాగంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆలయ ట్రస్ట్ చైర్మన్ చిట్టీపు మల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ నర్మద ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. గణపతి పూజ, వాస్తు పూజలు, నవగ్రహ హోమాలు, యాగాలు, పూర్ణాహుతి, మహామంగళహారతులతో ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంలో నిండిపోయింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు పీఠాధిపతులు, ఆధ్యాత్మిక గురువులు ఆశీస్సులు అందించగా, సాయంత్రం భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భజన బృందాలు కీర్తనలు ఆలపిస్తూ ఆధ్యాత్మికోత్సాహాన్ని నింపాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా మారాలని ఆకాంక్షించారు. భక్తుల విశ్వాసానికి నిదర్శనంగా నిర్మించిన ఈ ఆలయం ప్రాంతీయ ప్రజలకు శాంతి, సౌఖ్యాలను ప్రసాదించాలని కోరుకున్నారు. మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించగా, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# షటిల్ ఆడుతూ వ్యక్తి మృతి



**ఉప్పల్ ఏప్రిల్ 29 ( జనం సాక్షి ):** రామంతాపూర్ ఎండోమెంట్ కాలనీలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కాలనీలో నివసిస్తున్న 46 ఏళ్ల కృష్ణారెడ్డి షటిల్ ఆడుతూ ఆకస్మికంగా కుప్పకూలి మృతి చెందారు. స్థానిక షటిల్ కోర్టులో స్నేహితులతో కలిసి ఆటలో పాల్గొన్న ఆయన, ఆట మధ్యలో ఒక్కసారిగా అస్వస్థతకు గురై నేలపై పడిపోయారు. అతను కిందపడిపోవడంతో అక్కడున్న స్నేహితులు, తోటి క్రీడాకారులు వెంటనే స్పందించి లేపే ప్రయత్నం చేశారు. ప్రాథమిక చికిత్స అందించేలోపే ఆయన స్పృహ కోల్పోయారు. వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, ఆసుపత్రికి చేరుకునే సరికి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ప్రాథమికంగా ఇది ఆకస్మిక గుండెపోటు (సడన్ కార్డియాక్ అరెస్ట్) కారణంగా జరిగిన ఘటనగా భావిస్తున్నారు. కృష్ణారెడ్డి ఆరోగ్యంగా ఉండేవారని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా షటిల్ ఆడేవారని ఆయన సన్నిహితులు తెలిపారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు కనిపించకపోయినా ఇలా ఒక్కసారిగా కుప్పకూలిపోవడం అందరినీ కలచివేసింది. ఇటీవలి కాలంలో వ్యాయామం లేదా క్రీడల సమయంలో యువకులు, మధ్య వయస్కులు గుండెపోటుకు గురవుతున్న ఘటనలు పెరుగుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో రామంతాపూర్ ఎండోమెంట్ కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# పుకార్లతో పెట్రోల్ బంకుల వద్ద భారీ రద్దీ



**ఉప్పల్ ఏప్రిల్ 29 ( జనం సాక్షి ):** ఉప్పల్, హబ్సిగూడ, రామంతాపూర్ నగరంలో ఇంధన కొరత ఏర్పడిందన్న పుకార్లు సోషల్ మీడియాలో వేగంగా వ్యాపించడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ఉప్పల్, హబ్సిగూడ, రామంతాపూర్ తదితర ప్రాంతాల్లోని పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు భారీ సంఖ్యలో క్యూ కడుతున్నారు. కార్లు, బైకులతో ఒక్కసారిగా బంకుల వద్దకు చేరుకోవడంతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ తీవ్రంగా ప్రభావితమవుతోంది. కొన్ని చోట్ల వాహనాల క్యూలు రోడ్డుమీదకే రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో ఈ రద్దీ మరింత పెరగడంతో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అయితే నగరంలో పెట్రోల్, డీజిల్ కొరత ఏమీ లేదని అధికారులు స్పష్టం చేశారు. సాధారణంగా సరఫరా కొనసాగుతోందని, సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించకూడదని, అనవసరంగా బంకుల వద్ద రద్దీ సృష్టించవద్దని కోరుతున్నారు.

# పెట్రోల్ బంకుల్లో ఏసిపి ఆకస్మిక తనిఖీలు

## కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు



**మల్కాజిగిరి,ఏప్రిల్ 29(జనంసాక్షి)** మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, వాహనదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మల్కాజిగిరి ఏసీపీ యాదగిరి రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మల్కాజిగిరి, నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు పెట్రోల్ బంకుల్లో ఆయన సివిల్ సప్లై అధికారులు,స్థానిక సిఐలతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గత కొద్ది రోజులుగా పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ వస్తున్న పుకార్ల నేపథ్యంలో అధికారులు ఈ సోదాలు చేపట్టారు. బంకుల్లోని స్టాక్ రిజిస్టర్లను, నిల్వ సామర్థ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ఏ బంకులోనూ ఇంధన కొరత లేదని, సాధారణ సరఫరా కొనసాగుతోందని తనిఖీల్లో తేలింది, సోషల్ మీడియాలో లేదా ఇతర మార్గాల్లో వస్తున్న తప్పుడు వార్తలను నమ్మి ప్రజలు భయాందోళనలకు గురికావొద్దు. ఎవరైనా కావాలని కృత్రిమ కొరత సృష్టించినా లేదా బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని, బంకుల వద్ద అనవసర రద్దీని తగ్గించాలని అధికారులు కోరారు.

# మహనీయుల జాతరను విజయవంతం చేయాలి

## కమిటీ చైర్మన్ బురాన్ ప్రభాకర్



**చేవెళ్ల, ఏప్రిల్ 29 (జనంసాక్షి)** నేడు చేవెళ్ళలో నిర్వహించనున్న మహనీయుల జాతరను విజయవంతం చేయాలని చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం పిలుపునిచ్చింది. నేడు నిర్వహించనున్న మహనీయుల జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్ బుధవారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహనీయుల కమిటీ చైర్మన్ బురాన్ ప్రభాకర్ మాట్లాడుతూ.. మహనీయులు సామాజిక న్యాయం, సమానత్వం, అంటరానితనం నిర్మూలన, అణగారిన వర్గాల అభ్యున్నతి కృషి చేశారని, వారి ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బసవేశ్వర మహరాజ్,డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ లాంటి వారి త్యాగాల బాటలో నడుస్తూ, రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ, సమ్మిళిత సమాజాన్ని నిర్మించడమే మనం వారికి ఇచ్చే నిజమైన నివాళి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహనీయుల కమిటీ వైస్ చైర్మన్ మాచన్ పల్లి రామస్వామి, కోశాధికారి ఏర్పుల మల్లేష్, చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సున్నపు ప్రవీణ్, కమిటీ సభ్యులు బ్యాగరి ప్రభాకర్, మల్లెపల్లి శ్రీనివాస్, చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు సున్నపు మాణిక్యం, మద్దెల జంగయ్య, బ్యాగరి సత్తయ్య, బ్యాగరి రామకృష్ణ, గజ్జెల యాదయ్య, బ్యాగరి అశోక్, బ్యాగరి అజయ్, సున్నపు నర్సింలు, బురాన్ నరేష్, బురాన్ రాజు తదితరులు ఉన్నారు.

## అక్రమ కట్టడాలను పట్టించుకోని అధికారులు

# జనసేన అధ్యక్షులు రామకృష్ణ



**జిల్లేడు చౌదరిగూడ (జనంసాక్షి)** ప్రభుత్వ భూములు అక్రమణకు గురి అవుతుంటే అధికారులు కాపడకుండా చోద్యంచుస్తునారు. జిల్లేడు చౌదరి గూడ పెద్ద ఎల్కచర్ల గ్రామంలో 130 సర్వే నంబర్ రెవెన్యూ ల్యాండ్ 5 ఎకరాల 5 గుంటల భూమి ఇందులో కొంత భాగం ప్రభుత్వ పాఠశాల ఉంది మరో కొంత భాగం లో కొంతమంది అక్రమంగా కట్టడాలు చేపడుతున్నారని మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొమ్మగల రామకృష్ణ పేర్కొన్నారు ఈ కట్టడాలు నిలిపేయాలని తహసీల్దార్ కు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు కొద్ది రోజుల క్రిందట అదే స్థలంలో కట్టడాలు చేపడితే అప్పటి తహసీల్దార్ నిర్మించిన గోడలు పడగొటరు మరల పునరావృతం చేపడుతున్న అక్రమ కట్టడాలను ఆపాలని అధికారులను కోరుతున్నారు.

# నిర్దిష్ట ప్రణాళిక, అంకితభావంతో చదవాలి

## ఆర్బీఓఎల్ ఎండీ బుయ్యని సరళ శ్రీనివాస్ రెడ్డి




తాండూరు ఎప్రిల్ 29(జనంసాక్షి )నిర్దిష్ట ప్రణాళిక,అంకిత భావంతో చదివి విద్యార్థినులు పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని ఆర్బిఓఎల్ ఎండీ బుయ్యని సరళ శ్రీనివాస్ రెడ్డిపేర్కొన్నారు.స్థానిక సిద్ధార్థ జూనియర్ కళాశాలలో హిందూ ధార్మిక పరిషత్ నిర్వహిస్తున్న ఫ్రీ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ మరియు ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కోచింగ్ తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బుయ్యని సరళ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 40రోజుల పాటు ఉచిత బాలికల ఇంజనీరింగ్, అగ్రికల్చర్ మరియు ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ విజయవంతంగా నిర్వహించడం పట్ల తరగతులు బోధించిన అధ్యాపకులకు హిందూ ధార్మిక పరిషత్ సభ్యులకు అభినందనలు తెలిపారు. విద్యార్థినులు గురువుల మార్గదర్శనంలో విషయ పరిజ్ఞానం పెంచుకొని పోటీ పరీక్షలో విజయం సాధించాలని,అభ్యాసమే మనిషిని పరిపూర్ణునిలుగ మారుస్తుందన్నారు. కావునా విద్యార్థినిలు అందరూ అంకిత భావంతో ప్రణాళిక బద్ధంగా చదివి ఇంజనీరింగ్, అగ్రికల్చర్ మరియు ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్షలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.గత సంవత్సరం తాండూర్ లో మొదటి సారిగా హిందూ ధార్మిక పరిషత్ శిక్షణ నిర్వహించి అనేక విద్యార్థినులకు మంచి ర్యాంకులు సాధించి రాష్ట్రంలోనే టాప్ కాలేజీల్లో సీట్లు సాధించడం సంతోషకరం అన్నారు.ఈ సంవత్సరం కూడా బాలికల కోసం 40 రోజుల పాటు ఉచిత శిక్షణ విజయవంతంగా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అని విద్యార్థినులు ఈ కోచింగ్ ను సద్వినియోగం చేసుకొని అనుకున్న లక్ష్యాలను చేరాలని,ఇలాగే మునుముందు ఎన్నో కార్యక్రమలు నిర్వహించడానికి మా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది అని తెలిపారు.ఈ సంధర్బంగా ఈ కార్యక్రమం విజయవంతం అవ్వడానికి కారణమైన అధ్యాపకులకు మరియు ధార్మిక పరిషత్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం తాండూరు టాపర్లుగా నిలిచిన విద్యార్థును వారి తల్లిదండ్రులను సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో హిందూ ధార్మిక పరిషత్ కన్వీనర్ గాజుల బస్వరాజ్ ,ఉపాధ్యాయురాలు ఉమాదేవి తాండూరు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నరేందర్, ఇంజనీరింగ్, అగ్రికల్చర్ మరియు ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కోచింగ్ కన్వీనర్ పర్యాద రామకృష్ణ,కౌన్సిలర్లు బంటు వేణు గోపాల్,అల్లాపూర్ శ్రీకాంత్,యువ నాయకులు బాతుల నాగు,హిందూ ధార్మిక పరిషత్ సభ్యులు ఓం ప్రకాష్ సోమాని,వినోద్ జైన్, పటేల్ విజయ్ కుమార్,అధ్యాపకులు,విద్యార్థినులు పాల్గొన్నారు.

# హయత్‌నగర్ తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో 100% ఉత్తీర్ణత



హయత్ నగర్, ఏప్రిల్ 29 (జనంసాక్షి ) పదవ తరగతి పరీక్ష ఫలితాలలో హయత్‌నగర్ లోని కుంట్లూర్ తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి, విశేష ప్రతిభ కనబరిచారని, అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం పాఠశాలకు గర్వకారణమని ప్రిన్సిపల్ నిర్మల తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నరేంద్ర, నరసింహ, అన్నపూర్ణ, అనిత, నస్రీన్ బేగం విద్యార్థులను అభినందిస్తూ, వారి కృషి, పట్టుదల ఫలితమే ఈ విజయమని అన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులుడి. చరణ్ 566, పి. రాకేష్ 552, ఎం. కార్తిక్ 551, షేక్ రిజ్వాన్ 550, డేవిడ్ ఇమ్మాన్యుయేల్ 543, ఎండీ ముబీన్ 505, ఎం. సోఫియాన్ 504, కె. తనూజ్ 503 సాధించారు. 2026-27 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి నుండి ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ వరకు ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన్ మైనార్టీ కమ్యూనిటీలకు చెందిన విద్యార్థులకు ఉచిత అడ్మిషన్లు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ నిర్మల తెలిపారు.

# తాసిల్దార్ కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా




కాప్రా ఏప్రిల్ (జనం సాక్షి ) 29 కాప్రా తాసిల్దార్ కార్యాలయం ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి ఫోటో లేకపోవడం దుర్మార్గమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాప్రా తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు పత్తి కుమార్ మాట్లాడుతూ కాప్రా తాసిల్దార్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఫోటో ఎక్కడ,ఇది ప్రభుత్వ కార్యాలయమా, లేక బిఆర్ఎస్ పార్టీ అడ్డ విమర్శిస్తూ ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఫోటోను విస్మరించి, రెవెన్యూ మంత్రి ఫోటోను కూడా పట్టించుకోకుండా... కనీస ప్రొటోకాల్ కూడా పాటించకుండా కళ్యాణ్ లక్ష్మి చెక్కులు జారీ చేయడం వెనుక ఆంతర్యం ఏమిటి,ప్రొటోకాల్ ఉల్లంఘించిన కాప్రా తాసిల్దార్ పై వెంటనే చర్యలు తీసుకోవాలి.తాసిల్దార్ ను వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విట్టల్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తోటకూరి శ్రీకాంత్, జి సత్యనారాయణ, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసి పత్రాన్ని లబ్ధిదారులకు అందజేసిన మాజీ కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్



నిజాంపేట్ ఏప్రిల్ 29( జనం సాక్షి) దుండిగల్ సర్కిల్ దుండిగల్ తాండ నివాసులు కోర్ర రేఖ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. విషయాన్ని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కి మాజీ కౌన్సిలర్ కుర్ర శంకర్ నాయక్ తెలియజేయగా వారు వెంటనే స్పందించి ప్రభుత్వం నుంచి మంజూరు చేయించిన రూ. 2,00,000/- (రెండు లక్షల విలువగల) సిఎంఆర్ఎఫ్ ఎల్ఓసి పత్రాన్ని లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. ఆపదలో ఉన్న పేద సభ్యులు సీఎం రిలీఫ్ ఫండ్ ని ఉపయోగపడుతుందని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

# పది ఫలితాల్లో

## నందివనపర్తి విద్యార్థుల ప్రభంజనం



**యాచారం, ఏప్రిల్ 29(జనం సాక్షి )** యాచారం మండలం పి.ఎం.శ్రీ జెడ్పీహెచ్ఎస్ నందివనపర్తి విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. కే.దివ్య 570 మార్కులతో మండల టాపర్‌గా నిలవగా, జె.మనీషా 567 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. వీరి విజయంతో పాఠశాల కీర్తి మండలం అంతటా మారుమోగింది. ఉపాధ్యాయ బృందం విద్యార్థులను సన్మానించి అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# వ్యవసాయ రంగంలో వస్తున్న కొత్త పద్ధతులను రైతులు అనుసరించాలి

## ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాజేశ్వర్ రెడ్డి



**బొంరాస్ పేట, ఏప్రిల్ 29 (జనం సాక్షి):** మండల పరిధిలోని రేగడి మైలారం రైతు వేదిక భవనంలో సర్పంచ్ చిట్టెమ్మ వెంకట్ రెడ్డి అధ్యక్షతన బుధవారం వ్యవసాయ శాఖ ,వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పరిగి డిఏటిటి సెంటర్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న కొత్త పద్ధతులకు అనుగుణంగా రైతులు పంటలను సాగు చేసుకోవాలన్నారు.అనంతరం సహాయ వ్యవసాయ సంచాలకులు శంకర్ రాథోడ్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగులో వచ్చే చీడపీడల నివారణ పద్ధతులలో రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పోలప్ప, ఉప సర్పంచ్ చంద్రప్ప, ఏఈఓలు హేమ, స్వాతి ,శైలజ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# విజయ హైస్కూల్ విద్యార్థుల బ్రహ్మోత్సవం




**కాప్రా, ఏప్రిల్ 29, (జనం సాక్షి ) :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలలో విజయ హైస్కూల్,ఆదిత్య నగర్,కాప్రా విద్యార్థులు ఈ సంవత్సరం కూడా విజయదుందుభి మోగించి కాప్రా మండలంలోనే 100శాతం అద్భుత ఫలితాలతో అగ్రస్థానంలో నిలిచింది. పాఠశాల టాపర్ గా అత్యధిక గుణములు పొందిన సాహితీ- 584,మేఘనాలహరి- 582,వరునిక - 579,భానువర్ధన్ రెడ్డి - 578,హర్షవర్ధన్- 578,కృష్ణ- 577,యామిని- 576, శివాని - 574,స్నిగ్ధ - 573, విజయ్ కుమార్ నాయక్ - 572, కే.కీర్తన - 571 గుణములను పొందారు.ఇవేగాక 550 గుణములకు పైగా 33 మంది,500 గుణములకు పైగా 92 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభను సాధించారు. అనంతరం ఉత్తమ ఫలితాలతో ప్రతిభను చాటిన విద్యార్థులకు పాఠశాల ఆవరణలో సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేసి పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు.మిఠాయిలను వితరణ చేసి,బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ఉత్తమ ఫలితాలను సాధించిన ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కొప్పునూరి బసప్ప,వ్యవస్థాపకురాలు శ్రీమతి విజయలక్ష్మి,కరెస్పాండెంట్ కొప్పునూరి రాజేశ్వర్,డైరెక్టర్ శ్రీమతి కొప్పునూరి వీణ, ప్రిన్సిపాల్ దేవినేని వెంగబాబు,ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి అద్దంకి పద్మావతి,పదవ తరగతి ఉపాధ్యాయులు మరియు మిగతా ఉపాధ్యాయుల బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# పటాన్ చెరువులో పారిశుధ్యాన్ని మెరుగుపరచండి



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** పటాన్ చెరువు సర్కిల్ పరిధిలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాల్సిన అవసరం ఉందని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయన్ అమిత్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం పటాన్‌చెరు సర్కిల్(సర్కిల్-46) పరిధిలో విస్తృత క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా పారిశుధ్య కార్మికులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, పనితీరును అడిగి తెలుసుకున్నారు. పటాన్ చెరువులో మెరుగైన పారిశుధ్యం కొనసాగాలంటే క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని జెడ్సి అధికారులను ఆదేశించారు. అనంతరం పలు జివిపి పాయింట్లను సందర్శించి చెత్త నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ మధ్యనే జిహెచ్ఎంసిలో విలీనమైన పరిసర ప్రాంతాల మున్సిపాలిటీలలో డ్రైనేజీ వ్యవస్థల పనితీరును సమీక్షించి, వర్షాకాలం దృష్ట్యా పూడికతీత పనులు వేగవంతం చేయాలని, సకాలంలో నాళాలను సంసిద్ధంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ క్రమంలో కొల్లూరు టు బిహెచ్ కె హౌసింగ్ కాలనీ నివాసితులతో సమావేశమై మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికుల నుండి సమస్యలపై అభిప్రాయాలు సేకరించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొల్లూరు డంపింగ్ యార్డును సందర్శించి అక్కడి చెత్త నిర్వహణ, ప్రాసెసింగ్ పనులను పరిశీలించారు. డంపింగ్ యార్డు నుండి వచ్చే సమస్యలను శాస్త్రీయ పద్ధతిలో పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రజారోగ్యం, పరిశుభ్రతే ప్రధాన లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని జోనల్ కమిషనర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జ్యోతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో వడ గండ్ల వర్షం పిడుగు పడి ఒకరు మృతి



**వికారాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 29 (జనం సాక్షి):** జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈదురు గాలులు ఉరుములు మెరుపులతో కురిసిన అకాల వర్షం కారణంగా రైతులకు చేతికొచ్చిన పంట తడిసి ముద్దవుతుంది. కూరగాయలు పువ్వులు పండ్ల తోటలు దెబ్బతింటున్నాయి. గత వారం రోజులుగా సాయంత్రం పూట ఉరుములు మెరుపులు ఈదురు గాలితో వడగండ్ల వర్షం కురుస్తుంది. తాజాగా వికారాబాద్ జిల్లాలోని కొన్ని మండలాలలో వడగండ్ల వాన కురిసింది. పెద్దేముల్ మండలం కొండాపూర్ గ్రామంలోని మొగులమ్మ పొలం దగ్గర ఉన్న చింత చెట్టుపై పిడుగు పడడంతో రైతు కోడి ఆనందం అక్కడికక్కడే మృతి చెందారు. ఏర్పుల జానీ(18) నీరేటి నరసింహులు అనే ఇద్దరు రైతులు పిడుగు పాటు కారణంగా తీవ్రంగా గాయపడ్డారు. పిడుగుపాటు మెరుపుతీగ ముగ్గురు రైతుల కాళ్ళ దగ్గర రావడంతో ఒకరు మృతి చెందగా ఒకరికి తీవ్రయమై గాయాలు కాగా ఒకరికి కాళ్లు చేతులు పనిచేయడం లేదు. ఈ ముగ్గురు రైతులు పొలంలో మేకలను కాయడానికి వెళ్లి అకాల వర్షం తీవ్రంగా రావడంతో చింత చెట్టు కిందకి వెళ్లారు. ఉరుములు మెరుపులు ఈదుడు గాలి తో కూడిన భారీ వర్షం పడుతున్న సమయంలో చింత చెట్టుపై పిడుగు పడింది. ఈ విషయమై గ్రామస్తులకు ఒక రైతు సమాచారం అందించగానే గ్రామస్తులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మెరుగైన వైద్యం కోసం తాండూర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరు రైతులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. కాగా అకాల భారీ వడగండ్ల వర్షం కారణంగా రైతుల చేతికొచ్చిన పంటలు తడిసిపోతున్నాయి. పూల తోటలు కూరగాయలు పండ్ల తోటలు భారీగా దెబ్బతింటున్నాయి. మామిడికాయలు రాలిపోవడం జొన్న ఉల్లిగడ్డ అరటి పంటలు దెబ్బతింటున్నాయి. కూరగాయలు ఆకుకూరలు వడగళ్ల వర్షం కారణంగా దెబ్బతిన్నాయి. వడగళ్ల వల్ల పూల తోటలు దెబ్బతిన్నాయి దీంతో రైతులకు నష్టం కలుగుతుంది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

# మహిళల, బాలల రక్షణ మనందరి బాధ్యత

## చేవెళ్ల డివిజన్ షీ టీమ్స్ ఇంచార్జ్ బి.శ్యాంసుందర్




**చేవెళ్ల, ఏప్రిల్ 29 (జనంసాక్షి)** మహిళల, బాలల రక్షణ మనందరి బాధ్యత చేవెళ్ల డివిజన్ షీ టీమ్స్ ఇంచార్జ్ బి.శ్యాంసుందర్ తెలిపారు. ప్రజ పాలన-ప్రగతీ ప్రణాళిక లో భాగంగా తెలంగాణ మహిళల బాలల రక్షణ విభాగం తరుపున చేవెళ్ల డివిజన్ షీ టీమ్స్ ఇంచార్జ్ బి.శ్యాంసుందర్ ఆద్వర్యంలో చేవెళ్ల మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందికి సాంఘిక సంక్షేమం, బాలల హక్కు, బాలల రక్షణ, ప్రతి చిన్నారికి బాధ్యత మనందరికి, లింగ వివక్షత, స్త్రీ ద్వేషం అనే అంశాల మీద అవగాహన సదస్సు నిర్వహించారు. షీ టీమ్స్ గురించి, సైబర్ నేరాలపై మానవ అక్రమ రవాణా, మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్సై శ్యాంసుందర్ మాట్లాడుతూ.. మహిళలు చిన్న పిల్లలకి ఎవరైనా ఏదైనా ఇబ్బంది కల్గించే విదంగా ప్రవర్తిస్తే ఊరుకునేది లేదు, ఏదైనా ఎమర్జెన్సీ లో డయల్ 100 లేదా 112 కి, సైబర్ నేరాల గురించి 1930 కి, బాల్యవివాహాలు లేదా చిన్నపిల్లలకి ఏదైనా ఇబ్బంది చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 కి, ఎవరైనా ఈవ్ టీజింగ్ కి పాలు పడితే చేవెళ్ల షీ టీం నంబర్ 8712663673 కి సమాచారం ఇవ్వాలి అని సూచించారు. సీజన్ ని బట్టి ప్రస్తుతం గ్యాస్ బుకింగ్, కేవైసీ అప్డేట్, ఆన్లైన్ బిజినెస్ అంటూ ఇంకా ఆన్లైన్ లో షాపింగ్ చేసేవారికి ఆఫర్ల వల్ల వేస్తూ మోసగాళ్ళు మోసం చేస్తూ ఉంటారు. కాబట్టి ఆన్లైన్ షాపింగ్ చేసేవారు ఫేక్ వెబ్సైట్ ల పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. సోషల్ మీడియా, ఓటిపి ఫ్రాడ్స్, ఆన్ లైన్ గేమ్స్ పట్ల జాగ్రత్త ఉండాలని అవగాహన కల్పించారు. ఇన్స్టాగ్రామ్, ఫేస్ బుక్ లో అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలని, ఒంటరి ఫొటోస్ ఎక్కడ కూడా అమ్మాయిలు అప్లోడ్ చేయరాదు, ఇన్స్టాలో గానీ వాట్స్ ఆప్ లో గానీ, ఫేస్ బుక్ లో గానీ ఇతర ఆప్ల ద్వారా అప్లోడ్ చేయొద్దని సూచించారు.మహిళల, బాలల రక్షణ మనందరి బాధ్యత అని అన్నారు. ఇతర ఆప్ ల ద్వారా గానీ గుర్తు తెల్వని వ్యక్తులు చేసే మెసేజ్ లకి, వీడియో లకి ఎలాంటి రిప్లేయ్ ఇవ్వకూడదు, అమ్మాయిలు చిన్నారులు ఉండే ప్రతి ఇంట్లో తల్లిదండ్రులు గుడ్ టచ్-బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమీషనర్ ఎస్.వెంకటేశం, మున్సిపల్ సిబ్బంది, చేవెళ్ల షీ టీం సభ్యులు మల్లేష్, జ్యోతి, వైద్యనాతం తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ అభివృద్ధికి కృషి

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, ఏప్రిల్ 29 (జనం సాక్షి ) :** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ప్రతి కాలనీకి అభివృద్ధి, మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కాప్రా డివిజన్ పరిధిలోని అశోక్ కాలనీ, సాయి సుమ ఎన్క్లేవ్ ప్రాంతాలలో రూ. 75 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. స్థానిక ప్రజలు సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు ఈ రోడ్లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.కాలనీ వాసులు ఎమ్మెల్యే కు తెలియజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నాయకులు బైరీ నవీన్ గౌడ్, మరాఠీ రవీందర్, భాస్కర్ గౌడ్ కాలనీ నివాసులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో

## విజయడంకా మోగించిన నవీన ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు



**కొడంగల్, ఏప్రిల్ 29 (జనం సాక్షి):** పదవ తరగతి ఫలితాల్లో నవీన ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి 100% ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన రబియా జీనత్ 559/600 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. అలాగే అక్షిత 524, అభినంద్ 524, సఫియా 507, చరణ్ రాథోడ్ 497 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు.మొత్తం 19 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై, అందరూ ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల యజమాన్యం, ఫౌండర్ డి. వెంకటయ్య, ప్రిన్సిపల్ డి.వి. నరేష్ రాజ్, వైస్ ప్రిన్సిపల్ సంతోష్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను మరియు వారి తల్లిదండ్రులను అభినందించారు.విద్యార్థుల విజయాన్ని పురస్కరించుకుని పాఠశాలలో స్వీట్లు పంచి, టపాకులతో సంబరాలు నిర్వహించారు.

# ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**కొడంగల్ ,ఏప్రిల్ 29 (జనం సాక్షి):** కొడంగల్ ప్రాంతంలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఆ ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు.బుధవారం కొడంగల్ నియోజకవర్గంలో కడ అభివృద్ధి అధికారితో కలిసి జిల్లా కలెక్టర్ ఆలయ నిర్మాణ పనులు, విస్తరణలో భాగంగా ఇండ్లు తొలగించే కార్యక్రమం మరియు లేఅవుట్‌ను పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఇండ్లు తొలగించబడ్డాయి, ఇంకా ఎన్ని తొలగించాల్సి ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇండ్లు తొలగించే కార్యక్రమాన్ని రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కడ అభివృద్ధి అధికారి వెంకట్ రెడ్డి, తహసీల్దార్ రాంబాబు, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# 15 మంది విద్యార్థులు పాస్

**మర్పల్లి ఏప్రిల్ 29 (జనంసాక్షి)** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని పట్లూరు ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న 15 మంది విద్యార్థులు ఇటీవల పదవ తరగతి పరీక్షలు హాజీరు అయ్యి బుధవారం విడుదలైన ఫలితాలలో 15 మందికి పదిహేను మంది విద్యార్థులు పాసయ్యారని హాస్టల్ సంక్షేమ అధికారి జి తుల్జారామ్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వసతిగృహాలలో ఉండి చదువుకునే విద్యార్థులకు అన్ని సౌకర్యాలను అందిస్తున్నారని, విద్యార్థులకు ప్రత్యేక బోధన బోధించడానికి ప్రత్యేకంగా ఉపాధ్యాయులు నియమించడం జరిగిందని ఆయన అన్నారు. ప్రభుత్వ హాస్టల్లో నివసిస్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అభ్యసించడం వల్ల పట్లూర్ హాస్టల్ విద్యార్థులు 15 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఆయన తెలిపారు. ఆయన సూచించారు.

# విజయరత్నలో విజయోత్సవం




బోడుప్పల్-జనంసాక్షి కృషితో నాస్తి దుర్భిక్షం అన్న సామెతను మరోసారి సార్థకం చేస్తూ విజయరత్న పాఠశాల పదవ తరగతి విద్యార్థులు 2026 ఎస్సెస్సీ ఫలితాల్లో అద్భుత విజయాన్ని నమోదు చేశారు. మారుతున్న కాలానుగుణంగా పరీక్షా విధానాలు,మూల్యాంకన పద్ధతులు మారినా విద్యార్థుల పట్టుదల,నిరంతర సాధన మాత్రం ఏమాత్రం తగ్గలేదని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.విద్యార్థుల్లో నిర్భయం, నిశ్చలత, నిరంతర అభ్యాసం వంటి లక్షణాలను పెంపొందించడంలో పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందం చేసిన కృషి ఈ విజయానికి ప్రధాన కారణమైంది. లక్ష్యసాధన దిశగా రూపొందించిన బోధన పద్ధతులు, నిరంతర మూల్యాంకనాలు, మార్కుల ప్రాధాన్యతపై స్పష్టమైన అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. 592 మార్కులు జె.అక్షర సాయి,బి.సిరి,591 మార్కులు పి.వైష్ణవి,ఎస్.మహాలక్ష్మి,590 మార్కులు ఎన్.అక్షిత,ఎ.ధరణిలతో పాటు 590 పైగా మార్కులు సాధించిన వారు 6 మంది,580--589 మధ్య 20 మంది,570--579 మధ్య 45 మంది,560--569 మధ్య 36 మంది,550--559 మధ్య 24 మంది,540--549 మధ్య 26 మంది మొత్తంగా 540 పైగా మార్కులు సాధించిన వారు 157 మంది,500 పైగా మార్కులు సాధించిన వారు 253 మంది ఉండటం విశేషం.పాఠశాల 100 శాతం ఉత్తీర్ణతను నమోదు చేసి మరోసారి తన ప్రతిష్ఠను నిలబెట్టుకుంది.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు కె. విజయసేనారెడ్డి,ఎమ్.నరేంద్రనాథ్,ఎమ్. నర్సింహ్మారావు,కె.శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులను పుష్పగుచ్చాలతో సత్కరించారు.విద్యార్థుల విజయంలో తల్లిదండ్రుల సహకారం కీలకమని వారు ప్రశంసించారు.అలాగే నిబద్ధతతో కృషి చేసిన అధ్యాపక బృందాన్ని, సిబ్బందిని అభినందించారు. విద్యార్థులలో సత్ప్రవర్తన, స్వీయ నియంత్రణ, అభ్యాసంపై దృష్టి పెట్టిన యాజమాన్యం మార్గదర్శకత్వంతోనే ఈ విజయం సాధ్యమైందని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. విజయరత్న విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుతూ విద్యా రంగంలో కొత్త శిఖరాలను అధిరోహించారు.

# బోడుప్పల్‌లో శ్రీ చైతన్య పాఠశాల ప్రభంజనం



**బోడుప్పల్-జనంసాక్షి** విద్యా రంగంలో మరోసారి తన అగ్రస్థానాన్ని చాటుకుంటూ శ్రీ చైతన్య పాఠశాల 2025--26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఎస్ఎస్‌సీ ఫలితాల్లో అద్భుత విజయాన్ని నమోదు చేసింది.ఈ ఏడాది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి, స్టేట్ లెవల్‌లో కూడా ప్రతిభ చాటడంతో పాఠశాల ఖ్యాతిని మరింత పెంచారు.ఈ విజయాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.స్కూల్ ప్రిన్సిపల్ సామ అశోక్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కఠోర శ్రమతో పాటు,వారికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులు,సహకరించిన తల్లిదండ్రులను ఈ వేదికపై ప్రత్యేకంగా గౌరవించారు.వైస్ ప్రిన్సిపల్ సామ శోభా రాణి పాఠశాల ప్రమాణాలు,నిరంతర పర్యవేక్షణే విజయానికి పునాది అని పేర్కొన్నారు. డైరెక్టర్ సామ సాయి అభిషేక్ రెడ్డి విద్యార్థులను పోటీ ప్రపంచానికి సిద్ధం చేయడంలో పాఠశాల ఎప్పటికీ ముందుంటుందని తెలిపారు.ఈ ఫలితాల్లో 500కి పైగా మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య 177గా నమోదు కావడం విశేషం.591 మార్కులు 1 విద్యార్థి,580--589 :7 మంది,570--579 :16 మంది,560--569: 25 మంది,550--559: 28 మంది,540--549: 25 మంది,530--539: 22 మంది,520--529: 20 మంది,510--519: 15 మంది,500--509 : 18 మంది విద్యార్దులు మార్కులు సాదించి శ్రీ చైతన్య స్కూల్ ప్రతిభ చాటారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి





**మోమిన్ పేట ఏప్రిల్ 29 ( జనం సాక్షి)** మొక్కజొన్న కేంద్రాలను వివిధ గ్రామాల రైతులు ప్రతీయోగం చేసుకొని లబ్ధి పొందాలని మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి పేర్కొన్నారు బుధవారం మోమిన్ పేట మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలుకు ప్రభుత్వం సరి అయిన నిర్ణయించి కొనుగోలు చేస్తుందని మండల పరిధిలోని రైతులు కొనుగోలు కేంద్రాన్ని యోగం చేసుకొని లాభాలు ఆర్టించాలని ఆయన సూచించారు వ్యవసాయ రైతులు తాము పండించిన పటంలో దళారులకు వేయకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే మంచి ధరతో పాటు రెండు రోజుల్లో రైతుల అకౌంట్లో డబ్బులు జమవుతాయి ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి నాగార్జున డిసిసిబి బ్యాంక్ మేనేజర్ కే ప్రభాకర్ రెడ్డి సహకార సంఘం ప్రత్యేక అధికారి మాధవి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మన్నె శంకర్ యాదవ్ మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు కోసిగి సురేందర్ పిఎసిఎస్ సీఈఓ శేఖర్ అసిస్టెంట్ సీఈవో బాలయ్య ఆయా గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు పిఎసిఎస్ మాజీ డైరెక్టర్లు సహకార సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



**కొడంగల్ ,ఏప్రిల్ 29 ( జనం సాక్షి):** కొడంగల్ మండలం అప్పయ్యపల్లి (ఏరన్ పల్లి) గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించి వాల్పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్ముఖ్ బుధవారం కొడంగల్ మండల కేంద్రంలో పోస్టర్ మరియు కరపత్రాన్ని ఆవిష్కరించి అప్పాయిపల్లి గ్రామంలో మే 6 వ తేదీన సాయంత్రం 5 గంటలకు విగ్రహావిష్కరణ సభకు కొడంగల్ నియోజకవర్గం మరియు పరిసర ప్రాంతాల ప్రజలందరూ పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదలతో చదివవితె ఏదైనా సాధించవచ్చు



**హయత్ నగర్, ఏప్రిల్ 29 (జనం సాక్షి )** హయత్ నగర్ లోని ప్రగతి హై స్కూల్ కు చెందిన ముడిమాల తేజస్విని పదవ తరగతి పరీక్షల్లో 573 మార్కులతో స్కూల్ టాప్ ర్యాంక్ సాధించిందని స్కూల్ ప్రధానోపాధ్యాయులు, యజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ముడిమాల భాగ్యమ్మ, రాజరత్నం కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. పట్టుదలతో చదివి పదవ తరగతిలో స్కూల్ టాపర్ గా నిలిచినందుకు చాలా సంతోషంగా ఉందని వారు అన్నారు. తేజస్విని తమ్ముడు ముడిమాల యశ్వంత్ 566 స్కూల్ మూడవ ర్యాంక్ రావడం సంతోషం కలిగించిందని అన్నారు. ఈ సందర్భంగా తేజస్విని, యశ్వంత్ లు మాట్లాడుతూ పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అని అన్నారు. ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

# 10 తరగతి ఫలితాల్లో మండలం విద్యా రంగంలో తన సత్తా చాటింది

మర్పల్లి ఏప్రిల్ 28 (జనంసాక్షి). బుధవారం విడుదలైన ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ముఖ్యంగా ఘనపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు మండల స్థాయిలో మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకుని రికార్డు సృష్టించారు.మండల విద్యాధికారి అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘనపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని పెట్లోల్లా చైతన్య 548 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అదే పాఠశాలకు చెందిన ఉల్లిగడ్డల సంధ్య ద్వితీయ స్థానంలో నిలిచి ప్రతిభ చాటింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ కార్పొరేట్ స్థాయి మార్కులు సాధించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ ఏడాది మండలంలో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది. మొత్తం 6 పాఠశాలలు వంద శాతం ఫలితాలను సాధించాయి.జెడ్పీహెచ్ఎస్ ఘనపూర్,కొత్తలాపూర్ ,కోటమర్పల్లి రావులపల్లి,జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియం మర్పల్లి,ఎస్టీ ఆశ్రమ పాఠశాల నూటికి నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్త సాధించారు.మండల వ్యాప్తంగా మొత్తం 451 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 431 మంది ఉత్తీర్ణత సాధించారు. కేవలం 20 మంది విద్యార్థులు మాత్రమే అనూహ్యంగా ఫెయిల్ అయ్యారు. దీంతో మండల సగటు ఉత్తీర్ణత 96 శాతంగా నమోదైందని ఎంఈఓ తెలిపారు. వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను మరియు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మండల ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.



# ఎస్ఎస్సీ ఫలితాలలో రెసోనెన్స్ అద్భుత ప్రతిభ

## ప్రతి నలుగురిలో ముగ్గురికి 500పైగా మార్కులు




**హైదరాబాద్, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** తెలంగాణ ఎస్ఎస్సీ 2026 ఫలితాలలో రెసోనెన్స్ స్కూల్స్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ప్రతి నలుగురిలో ముగ్గురు 500 పైగా మార్కులు సాధించడం విశేషం. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. మాదాపూర్‌లో ఉన్న ఆశ్రయ కన్వెన్షన్‌లో పదో తరగతి ఫలితాల విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ తెలంగాణ ఓ ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణ చంద్రరావు నర్రా మాట్లాడుతూ తెలంగాణ ఎస్ఎస్సీ ఫలితాలు 2026లో మా విద్యార్థులు సాధించిన విజయంపై మాకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ముఖ్యంగా ప్రతి నలుగురిలో ముగ్గురు 500 పైగా మార్కులు సాధించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఇది విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావానికి నిదర్శనమన్నారు. తల్లిదండ్రుల విశ్వాసం, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మాధాపూర్, పటాన్‌చెరువులోని క్యాంపస్‌లు గత కొన్ని సంవత్సరాల మాదిరిగానే ఈసారి కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. నగరవ్యాప్తంగా మరింత మందికి అందుబాటులో ఉండేలా మా స్కూల్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎస్ఎస్సీ 2026లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రతి నలుగురిలో ముగ్గురు రెసోనెన్స్ స్కూల్ విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. తొమ్మిది మంది విద్యార్థులు 580 మార్కులు, అంతకంటే ఎక్కువ సాధించారు. 47 మంది విద్యార్థులు 550 నుంచి 579 మార్కుల మధ్య సాధించారు. 60 మంది విద్యార్థులు 500 నుంచి 549 మార్కుల మధ్య సాధించారు. మొత్తం విద్యార్థుల్లో 71 శాతం మంది 500కు పైగా మార్కులు సాధించారు. మొత్తం విద్యార్థుల్లో 93 శాతం మంది 450కు పైగా మార్కులు సాధించారు.

# మల్లంపేట్ వీరాంజనేయ భూములను కాపాడండి

**దుండిగల్ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు**


**మంత్రుల పేర్లు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నట్టు ఆరోపణలు**

**పొజిషన్‌లో లేనివారికి ఎలా రికార్డులు మారుస్తారని ఆగ్రహం**

**తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన**




**నిజాంపేట్ (జనంసాక్షి) :** మల్లంపేట్ వీరాంజనేయ స్వామి దేవాస్థనం భూమి వివాదం చినికి చినికి గాలి వానల తయారు అవుతుంది. 75 ఏండ్లుగా రికార్డుల్లో దేవుడి పేరు, పూజారుల పేర్లు నమోదు అయి ఉన్నాయి. తాజాగా భూ భారతీలో కూడా అవే రికార్డులు కంటిన్యూగా ఉన్నాయి. కాని కొంత మంది 1951లో తాము సెల్ డీడ్ ద్వారా కొనుగోలు చేశామని చెప్పుకుంటూ సర్వే నెంబర్ 112లోని 02.03 గుంటలను కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. 2017లో ఎక్స్ పార్టీ అర్డర్స్ తెచ్చుకుని పెట్టుకున్నారు. రికార్డులు మార్పులు చేసేందుకు అధికారులు భయపడ్డారు. ఆ కోర్టు తీర్పు గురించి ఇప్పటి వరకు గ్రామస్థులకు తెలియ కుండా మేనేజ్ చేశారు. ఎవ్వరైనా ఆ భూమిని హన్మండ్ల పొలంలాగనే గతంలో దేవాస్థనం పరిధిలో ఏటేటా వేలం వేసుకుని దేవుడికి ఏటా 2 క్వింటళ్ల బియ్యం నైవేద్యంగా దేవుడికి ప్రసాదం రూపంలో ఇచ్చే వారు. 2014 నుంచి ఖాళీ పొలంగా చూస్తుంటారు. అయితే ఇదే అదునుగా పొలాన్ని కబ్జాకు ప్రయత్నం చేశారని గ్రామస్థులు అరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొంత మంది మంత్రుల పేర్లు చెప్పుకుని ఈ 100 కోట్ల భూమిని కొట్టేసుందుకు కుట్రలు పందుతున్నారని విమర్శిస్తున్నారు. ఎట్టి పరిస్థితిలో ఈ భూమి రికార్డులు మార్చవద్దని పిర్యాదులో పెర్కొన్నారు. తహశీల్దార్ ఆఫీస్ ముందు గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఆ తర్వాత రాత్రి వీరాంజనేయ స్వామీ భూమిలో ప్లేక్సీలు చింపివేసిన వారి పై చర్యలు తీసుకోవాలని దుండిగల్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. కబ్జాదారులు, తెరవెనక కుట్రదారులను పసిగట్టి గ్రామంలో శాంతి భద్రతలు విఘూతం కల్గకుండా ప్రశాంతంగా ఆ భూమిని గతంలో వాడుకు న్నట్లు హన్మండ్ల సేవాకు వాడుకోవాలని గ్రామస్థులు అధికారులను వేడుకున్నారు. ఈ కార్యాక్రమంలో వీరాంజనేయ దేవాలయం అధ్యక్షులు ఎంబరీ అంజనేయులు మాజీ కౌన్సలర్ శామీర్ పేట్ హన్మంతరావు, ప్రకాశ్ రావు, సిహెచ్, దేవేందర్ రెడ్డి, నర్సింగరావు, అనిల్ రెడ్డి, అతీష్ బాబు, బి. రాము గుప్తా, జె. శంకర్, కె. గణేష్, మాదాస్ నవీన్ కుమార్, అధిత్య, బాల చారీ, అమన్ రాజు, బ్రహ్మ చారీ, ఊట్ల నారాయణ, ఎస్ శివకుమార్ లతో పాటు మరో 20 మంది గ్రామస్థులు పాల్గోన్నారు.


Date: 29-04-2026

Respected Sir,

Yours faithfully,

# ఘనంగా శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ గంగా పరమేశ్వరి శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయం గంగపుత్ర సంఘం సబ్జీ మండి కార్వాన్ భాగ్యనగర్ 28వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవతమూర్తులకు కుంభాభిషేకం, హోమం, అన్న ప్రసాదం, బలి అన్నం, బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షులు దొత్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి, ఆనందేసి





వేణుబాబు, ఉపాధ్యక్షులు నాసా నర్సింగరావు, గుడిమని కేశవులు, ఆలయ కమిటీ అధ్యక్షులు గుర్రం శివశంకర్, ప్రధాన కార్యదర్శి పూస శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గౌటీ నర్సింగరావు, కార్యదర్శులు పెద్ది క్రాంతి కుమార్, తత్తరి రాజేష్, అన్నప్రసాద దాత పల్లెల గన్షామ్ వారి బృందం, బస్తీవాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బిఎస్పీ షాద్‌నగర్ నియోజకవర్గ ఉపాధ్యక్షునిగా నీరటి రాజు



**ఫరూఖ్ నగర్ (జనంసాక్షి) :** నేడు బహుజన్ సమాజ్ పార్టీ షాద్ నగర్ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్బి జగన్ అధ్యక్షతన,రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్ ముఖ్య అథితి గా జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బహుజన రాజ్యాధికార లక్ష్యంతో, దశాబ్ద కాలంగా క్రమశిక్షణ గల సైనికుడిలా పని చేస్తున్న నీరటి రాజునీ బి.ఎస్.పి షాద్‌నగర్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడిగా నియమించడం పట్ల నియోజకవర్గ వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.గత పదేళ్లుగా పార్టీ జెండాను భుజాన వేసుకుని షాద్‌నగర్ పట్టణ వీధుల్లో బహుజన వాదాన్ని బలంగా వినిపించిన నిఖార్సయిన నాయకుడు నీరటి రాజు సామాన్య కార్యకర్త స్థాయి నుండి నేడు నియోజకవర్గ స్థాయి కీలక బాధ్యతలను చేపట్టడం ఆయన పట్టుదలకు, పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనం,ఈ సందర్భంగా నీరటి రాజు మాట్లాడుతూ నా మీద నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్ కు నియోజకవర్గ ఇంచార్జ్ గుండేటి నర్సింహులుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. పదవిని అలంకారంగా కాకుండా, ఒక బాధ్యతగా భావిస్తున్నాను. షాద్‌నగర్ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో పార్టీ క్షేత్రస్థాయి నిర్మాణానికి నా శక్తవంచన లేకుండా కృషి చేస్తాను. బహుజనుల గొంతుకగా అసెంబ్లీ వ్యాప్తంగా నీలి జెండాను రెపరెపలాడించడమే నా లక్ష్యం అన్నారు.ఈ కార్యక్రమంలో ఫరూక్ నగర్ మండల అధ్యక్షులు శివగళ్ల ఆంజనేయులు, నాయకులు మద్రి శివ కుమార్, పెద్దింటి ఆంజనేయులు, మొగిలిగిద్ద జయప్రకాశ్,బైండ్ల మల్లేష్ పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో సత్తా చాటిన సర్కార్ బడుల విద్యార్థులు

## ప్రైవేటు దీటుగా ఫలితాల్లో జోరు

**10,ఫలితాల్లో 99.55 శాతం ఉత్తీర్ణత సాధించడంతో హర్షం వ్యక్తంచేసిన మండల విద్యాధికారి చాంప్లా నాయక్**



**తలకొండపల్లి ఏప్రిల్ 29(జనంసాక్షి):** పది ఫలితాల్లో తలకొండపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటుకు దీటుగా ఫలితాలను సాధించి,అద్భుతమైన ప్రతిభను కనబరిచారు.ఉపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణ,విద్యార్థుల కఠోర శ్రమ,ఈ ఏడాది విద్యా శాఖలో మెరుగైన ఫలితాలు నమోదయ్యాయి..తలకొండపల్లి మండలం 10 ఫలితాల్లో 99.55 శాతం ఉత్తీర్ణత సాధించి తన ప్రత్యేకతను చాటుకుంది.మండల వ్యాప్తంగా మొత్తం 448 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందులో 446 మంది విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు.కేవలం 2 మంది విద్యార్థులు మాత్రమే తృటిలో ఉత్తీర్ణతను కోల్పోయారు.మండలంలోని కేజీబీవీ పాఠశాలలోని 49 మంది విద్యార్థులకు గాను 49 మంది ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు.మండలంలో మొత్తం 15 పాఠశాలలకు గాను 14 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.కేవలం చుక్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే 93 శాతం ఉత్తీర్ణత నమోదయిందని మండల విద్యాధికారి చాంప్లా నాయక్ వెల్లడించారు.

**సత్తాచాటిన సర్కార్ విద్యార్థులు**

మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని పి.గీతాంజలి 564 మార్కులతో ప్రభుత్వ విభాగంలో మండల టాపర్ గా నిలువగా,తలకొండపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి కేతావత్ సిద్దు 558 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు.ప్రైవేటు పాఠశాల విభాగంలో తలకొండపల్లి అక్షర హై స్కూల్ విద్యార్థిని ప్రజ్ఞ 565 మార్కులతో మండల స్థాయిలో టాపర్ గా నిలిచారు.లిటిల్ స్కాలర్ హై స్కూల్ విద్యార్థిని బి. మానస 558 మార్కులతో ప్రైవేటు పాఠశాల విభాగంలో ద్వితీయ స్థానంలో సత్తా చాటారు.

**విద్య అధికారుల భరోసా..**

పదిలో ఫెయిల్ అయిన విద్యార్థులు అధైర్య పడకుండా జూన్ నెలలో జరిగే అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు సిద్ధం కావాలని మండల విద్యాధికారి చాంప్లానాయక్ సూచించారు.